# ఇల్లాలు

శ్రీ విద్వాన్ నాగసిద్దారెడ్డి

రోజూ ఎందుకలా ఆమెను తిట్టూ, కొట్టూ, నానా బాధలు పెడ్తుంటారో నా కర్థమయ్యేదే గాదు. వాళ్లింటి ప్రక్క మిద్దెమీదే నా రూమువడం చేత ఆయింట్లో యేంజరిగినా నా చెవున పడి తీరాల్సిందే. ఆ యింట్లో యెవరు యెవర్ని బాధిస్తున్నారు? ఎందుకు? కనుక్కుందామనే వుబలాటం నాలో ప్రశతిమించుతూ వుంటుంది. కాని 'ఊడత కెందుకు వూళ్లో పెత్తనమని' నన్ను నేనే సమాధాన పఱచుకుంటూ వుండేవాణ్ణి. మీరాత్మస్తుతి అనుకోండి, మరేమైనా అనుకోండి. ఒకరు కష్టపడుతూ వుంటే చూస్తూ 'నాకెందుకు లెమ్మ'ని పోయే ఘటం గాదు నేను. అందుచేతనే నాకాయింటి సంగతి ఆ మూలాగ్రం కనుక్కుందామనే ఉత్సాహం.

ఆ రోజు ఆదివారమవడంచేత రూములో కూర్చొని అవసరమైన, అనవసరమైన ఆలోచనలతో బుర్రను పాడుచేసుకొంటున్నాను. ఇంతలో "అమ్మా" అనే ఒక దీనమైన శబ్దం నా చెవినిబడింది. "చచ్చాట్రా యెవరో పాపం" అని దిగ్గున మిద్దెపైకెళ్లి పక్కింట్లోకి "యేమైనాగాని" అని తొంగి చూశాను. ఇంకేముంది? "అమాసె మొగమా, సినిమాకెళ్లాలి ఫేసు పౌడర్ తేవే అంటే కనబడలేదంటావూ, అదెక్కడ దాచిందో శనిపీనుగ" అంటూ రుసరుసలాడుతూ బుసకొడుతూవుండే ఓ యిరవైయేళ్ల యువతి నాకంటబడింది. దేనితో కొట్టిందో ఏమోగాని కారే రక్తాన్ని తుడుచుకుంటూ మరో వ్యక్తి కిక్కురుమనకుండా అలానే నిలబడివుంది.

ఆమెకు యిరవైఅయిదేళ్లుండచ్చు. గట్టిగాగాలి వీస్తే యెగిరి పోతుందా అనేటంత సన్నంగానూ, నీరసంగానూ, వుందా విగ్రహం. అందమైన ఆ గుండ్రని ముఖంలో విశాలమైన కన్నులు తీర్చిదిద్దినట్లున్నాయ్. ముఖ్యంగా చెప్పవచ్చే దేమంటే యెంత విచారంగానూ, దైన్యంగాను వున్నప్పటికీ యేదో చెప్పరాని దివ్యతేజస్సు ఆమె ముఖంలో వుంది. ఆవిడ మనస్సులో యెన్ని అగ్నిపర్వతాలు ప్రేలిపోతున్నాయో. ఆ బరువైన కన్ను రెప్పల్లో నుండి జారే నీటిబిందువులే మనకు సాక్ష్యం.

"పాపం, ఆమె యెంతబాధ పడుతూవుందో పురుషుణ్ణయిన నేను చూస్తూకూడ యేమీసాయం చేయలేక పోతున్నానే" అనే విచారంతో ఆలోచిస్తున్నాను. "వాళ్లెవరు లేని సమయంజూచి ఆమెతోనే 'యెందుకలా వారు బాధిస్తున్నారో' అడిగేస్తే? అమ్మో, పాపిష్టిలోకం నిజానిజాలు తెలుసుకోకుండ తప్పెట గట్టుకొని చాటదూ' అయినా యీలోకానికేం పోగలమో తెలీదుగాని అన్నా చెల్లెళ్లైనా సరే, అమ్మా కొడుకులైనా సరే, ఒంటరిగా కనబడు తేచాలు, రామ, రామ, యింకచెప్పడ మెందుకు? పోనీ, యీపాడులోకం యేమనుకుం నాకేం, నా అభిప్రాయంమంచిదేగదా, నేనెందుకీ లోకానికి భయపడ్డం? ఇంతకూ నేను మంచి యుద్దేశంతో మాట్లాడినప్పటికీ ఆమే దురభిప్రాయ పడితే? సరే, అప్పుడు యోచిస్తాం, సాహసించాను.

అదృష్టవశాత్తు యింట్లో యెవరూలేని సమయం జూచి లోనికడుగుబెడుతూ "ఏమండీ, యింట్లో యెవరూలేరా" అంటూ పిలచాను, లోపల వంట పనిలో లీనమై వుండినదేమో కొంచెమాలస్యంగా ఆమే వచ్చి "ఎవరు తమ్ముడూ; వారు, మా చెల్లెలు కలసి సినిమాకెళ్లారు. వారు రావడానికి రెండు, మూడు గంటలైనా పట్టచ్చు." అని తిరిగి వెళ్లిపో బోతూవుంది. 'తమ్ముడూ' అనే ఆమధురవాక్కు నన్ను సంతోష సముద్రంలో ముంచి తేల్చింది. ఆరేండ్లప్పుడు చనిపోయిన మా అక్కయ్య పిలుపు నాకు స్మృతి పథంలో మెఱసింది. "అక్కయ్యా, వారితో నాకేమీ పనిలేదు. నేను మీతోనే పనుండి వచ్చాను. వేరే విధంగా భావించకమ్మా" అంటూ ఆమె ననుసరించాను. నామాటల కాదీన వదనంలో చిన్న మందహాసమంకురించి వెంటనే

మాయమైంది. "రా, నాయనా, కూర్చో, యీ దౌర్భాగ్యురాలితో నీకేంపని తమ్ముడూ?" అని నాకో కుర్చీ చూపించి నాయెదురుగ్గా ఆమె నిలబడింది -

ఏమని ముందుగా సంభాషించాలో తెలీక కొంచెము సేపు వుక్కిరిబిక్కిరై కడకు 'అమ్మా, నేను మీ ప్రక్కింటి మిద్దిమీదే వున్నాను. ప్రతినిత్యం మీ యింట్లో జరిగే అఘాయిత్యం నా చెవున పడుతూనేవుంటుంది. ఎందుకు నిన్నావిధంగా హింసిస్తున్నారో తల పగులకొట్టుకున్నా నా కర్థంగావడంలేదు. ఆ విషయం నిన్నే అడిగి కనుక్కొని యేమైనా నేను సాయం చేయగలిగేటట్లయితే చేస్తామని వచ్చాను. దయయుంచి నీ యీ సోదరునితో నీకెందుకీ కష్టాలో చెప్పితీరాలి" అని యేమి బదులు పలుకుతుందో అనుకుంటూ ఆమెవైపే చూస్తున్నాను. నా మాటలకామె కళ్లల్లో నీళ్లుతిరిగాయ్. కారే కన్నీళ్లను తుడుచుకోవడానికికూడ ప్రయత్నించకుండా "నాయనా, యిన్నాళ్లకు నీ నోటి నుండి వెడలిన యీసానుభూతి వాక్యాలు నాకెంతో ఆనందాన్నిస్తూవున్నాయ్. కాని జీవితాకాశంపై నిరాశామేఘాలా వరించిన నాకు నీ సాయమెందుకు బాబూ? అయినా నా చరిత్రంతా నీకెందుకో చెప్పాలనిపిస్తూవుంది. సావకాశంగా వింటావుగదూ" అంటూ ఓ దీర్ఘ నిట్టూర్పు విడచి యిలా చెప్పసాగింది-

"నేనొక బీదకుటుంబములో పుట్టాను. అయినప్పటికీ మా అమ్మా నాన్నకు నేనొక్కతెనే కూతురునవడంచేత యెంతో అల్లారు ముద్దుగా పెరిగాను. 'నా చిట్టితల్లి ఏభాగ్యవంతునికైనా యిచ్చి పెళ్లిచేస్తే హాయిగా, ఆనందంగా బ్రతుకుతుంద'నే వెఱ్ఱి ఆశ మా తల్లిదండ్రులకుండేది. కాని డబ్బును పెండ్లాడే యీ కాలంలో గుణగుణాల్ని యెవరు చూస్తారు? యేలంకోసరమని మిత్రుడొచ్చినా పది వేలకు పైపాటేగాని దిగిరాడుగదా, కడకు నాకీ నిర్భాగ్యపు రాతవుందేమో అయిదువేలు నగదు చెల్లిస్తే చేసుకుంటామన్నారు మా మామగారు. సరే, యేదో విధంగా అంటే మా అమ్మమెళ్లో మంగళ సూత్రం తప్ప మిగిలిన వస్తువులన్నీ అమ్మి నాలుగు వేలు జమచేసి పెళ్లయిన మరునెల్లోనే ఆ వెయ్యి ముట్టచెప్తామన్నారు మా నాన్నగారు. సనేమిరా అంటే సనేమిరా అని కడకెల్లాగో మా తండ్రిగారు మా వారికాళ్లావేళ్లాబడి ప్రార్థించడం చేత యిష్టము లేకున్నా నామెళ్లో తాళిగట్టారు. కాని నెలలోపల మా అయ్య వెయ్యిరూపాయ లెక్కడ తేడం? గడువులోపల డబ్బు చెల్లించలేక పోయారు మానాన్నగారు.

బాబూ, పెళ్లయిన నెలరోజులేమి సుఖమనుభవించానో, అంతే. మా మామగారు, భర్తగారు స్వతహాగా మంచివారైనా డబ్బుతేలేదనే మిషతో సూటిపోటి మాటలతో నన్ను వేధించని నిముషముండదు. నా తండ్రి బాకీ యివ్వలేకపోతే నేనేం పాపం చేశాను? ఇంటి దాసీదాన్నికూడ మాన్పించేసి అన్నిపనులు నాచేతే చేయించేవారు. తమ్ముడూ, యేం చేయను? నాదురదృష్టాన్ని నేనే నిందించుకుంటూ వారుచెప్పిన పనులన్నీ చేసేదాన్ని. ఇంతచేస్తున్నా వారు నన్ను దుఃఖ పెట్టడం మానుకొన్నారా? "దరిద్రపు మొగం మాకెక్కడ దాపురించిందనీ, దాసీముండను నాభార్య అని యెలా చెప్పుకోవడమనీ నాభర్తే నన్ను హింసిస్తూవుండేవారు. అన్ని బాధలను సహిస్తూ వొళ్లు హూనమయ్యేటట్లు కన్న చాకరీ చేస్తున్నా వారికి తృప్తికల్గలేదేమో, ఎవరో డబ్బువేలిస్తామన్నారని నేనుబ్రతికుండగానే రెండో పెళ్లికూడ చేసుకున్నారు" అని చెప్తూ వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక బావురు మని యేడ్చింది.

ఆమె చెప్పే విషాదగాథను వింటూవుంటే నాకళ్లు చెమ్మగిల్లాయ్. ఉబికి వచ్చే శోకాన్ని దిగమ్రింగుకుంటూ "ఎందుకక్కయ్యా, ఏడుస్తావ్. యీ జన్మలో గాకున్న మరుజన్మంలోనైన యీదుర్మార్గులకు తగిన ప్రాయశ్చిత్తం జరుగకుండ పోతుందా?" అని యేదోవిధంగా ఓదార్చాను. కన్నీళ్లు తుడుచుకుంటూ తిరిగి ఆమె యిలా చెప్పసాగింది.

"నాయనా రెండో ఆవిడ వచ్చింది. ఆమె ధనవంతుల బిడ్డ అవడం చేతను, ఇంగ్లీషు అంతో యింతో చదువుకోవడం చేతను, నేటి నవనాగరికతా లక్షణాలన్నీ ఆమెలో అచ్చు గ్రుద్దినట్లున్నాయ్. ఉదయం వారు లేచేసరికల్లా కాఫీ సిద్ధం చేయడం మొదలు రాత్రిపడుకొనే వఱకు అన్ని పనులు బహుజాగ్రత్తగా నేను నిర్వహించవల్సిందే. అటు మామకు, భర్తకు, యిటు మాచెల్లెలికీ విరామం లేకుండ సేవచేయడం చేతను, పైగా సంతోషమంటే యెలా వుంటుందో తెలీక పోవడం చేతను, నేనెలా కృశించి పోయానో చూస్తున్నావుగదూ? ఇంత బండ చాకిరీ చేస్తున్నా లేనిపోని వన్నీ భర్తతో చెప్పి చావగొట్టిస్తూ వుంటుంది మాచెల్లెలు. మొన్న నేను పౌడరు కన్పడలేదని చేతనున్న గ్లాసుతో కొట్టిన దెబ్బ చూడు బాబూ, పాడుదెబ్బ కొంచెము క్రిందతగులక పోయింది హాయిగా చనిపోయేదాన్ని. యింతకూ ఆపౌడరు వెదకితే తనపెట్టెలోనే కనబడ్డది. భర్త కొట్టేదెబ్బలతో, మామగారి యీసడింపులతో, సవతికి చేయాల్సిన సేవతో, యేదో వొకవిధంగా యీమొండిప్రాణాన్ని బాధలు చాలవని గుండె జబ్బుకూడ యేర్పడింది. నేను బ్రతికితే మాత్రం యింకెన్ని దినాల్లేతండ్రీ." అంటూ తనకథ ముగించింది.

ఆమె చెప్పిన కథంతా విన్నాను. ఆవిడకెలా సాయం చేయాలో బోధపడ్డంలేదు. వెధవ కట్నాలతో యెన్ని జీవితాలు నాశనమౌతున్నాయో? యీనాటి దౌర్భాగ్య దామోదరుల కేమిచేటు కాలమోగాని వచ్చే భార్యయెంత డబ్బుతెస్తుందనే యోచనేనా? యెంత గుణవతియైనా, ఎంత సౌందర్య రాశిఐనా డబ్బుచెల్లించలేక పోయిందా, ఆమె నిర్భాగ్య జీవిత మడవిగాచిన వెన్నెలేగదా, ఛీ! ఛీ! అని తలచేత్తో పట్టుకొని యీలోకాన్నే మఱచి ఆలోచిస్తున్నాను.

చెడ్డకాలమనేది, యెప్పుడు, యేరూపంలో వస్తుందో వూహించే వాఁడెవడు? "ఎవడే వీడు? ఒంటరిగా యేమిటే వానితో సరసాలాడుతున్నావ్. నీకైతేను మొఖానికి పైయాటలుగూడ వున్నాయా? జెట్టపీసుగా" అని నిందించే ఆమె మామగారి కఠోర వాక్యాల కులికిపడి లేచాను. ఏదో వూరికెళ్లి అప్పుడే దిగబడ్డాడు కాబోలు, చేతిలో సంచి దిగువ పెట్టకుండానే పనికిమాలిన కోతకూతలు కూస్తున్నాడు. అతనిమాటల కామె నిలువునా నీరైపోయింది. నేను మాత్రమాతని మాటలకు సహింపలేక పోయాను. "క్షమించాలండీ, యీమె నాకు చెల్లె ... ..." అని చెప్పబోతున్నాను, ఆముసలి దద్దమ్మ నామాటలన్నీ వింటేనా? "నోరుముయ్. బుద్ధిలేని వెధవా, చేసేదుర్మార్గము చాలకుండ యింకా యేమేమో వాగబోతున్నావ్? నడు, ముందుకు" అని గదమాయించాడు. ఇంకేమి నోరు తెఱచినా బయట దేహశుద్ధి జరిగి తీరుతుందనే నమ్మకంతో దీనంగా చూస్తూ నిర్జీవంగా నిలబడివున్న మాఅక్కయ్యవైపు చూడ్డానికూడ భయపడి మెల్లగా జారుకున్నాను.

ఇంకీరూములో నుండటం ప్రమాదమనుకుంటూ, పాపం, ఆమెకు లేనిపోని బాధలు నేనే తెచ్చి పెట్టానే అని చింతిస్తూ, ఇంతకూ దైవనిర్ణయ మెట్లుంటే అలా జరిగి తీరాల్సిందే గదా అని నన్ను నేనే సమాధాన పఱచుకుంటూ, ఎవరైనా నాకొఱకు వస్తారేమో, ఎందుకైనా జాగ్రత్తమంచిదని తలుపు భద్రముగా గడియవేసుకొని వద్దనుకున్నా పైబడే నిద్రాదేవి కౌగిలిలో లీనమయ్యాను.

తెల్లవారింది. రాత్రిజరిగిన సంఘటనను తలచుకుంటూ, మా అక్కయ్యను రాత్రి ఆదుర్మార్గులు బ్రతుకనిచ్చి యుంటారా? అనుకుంటూ బైటకు వచ్చి వీధివైపు చూచాను. ఇంకేముంది? నేనేమని అనుమానపడ్డానో అంతాజరిగి పోయింది. ఆమెశవాన్ని బైటకు వడుతున్నారు. ఆదృశ్యాన్ని చూచిన నాకు గుండె పని చేసేదీ, లేనిదీ కూడ సంసయమైంది. "రాత్రి గుండెజబ్బుతో మరణించిందట, పాపం. మంచియిల్లాలు" అనే అమ్మలక్కల మాటలు ములుకుల్లా చెవుల్లో నాటుతున్నాయ్. ఆశవం దగ్గఱ మొసలి కన్నీరు గార్చే ఆధూర్తుల జూచి 'అయ్యో' అని నిట్టూర్చింది లోకం. కాని ఆపాడు ప్రపంచానికాయిల్లాలిని ఆనరరూప రాక్షసులే కొట్టిచంపారనే నిజ మెలా తెలుస్తుంది?